
సాక్షి
నిర్మల్
బుధవారం ၊ 2 ၊ ఏప్రిల్ ၊ 2025



బడిబ్యాంక్ జాడేది?
విద్యార్థుల పొదుపు పథకం సంచయిక జిల్లాలో నిలిచిపోయింది. పాఠశాల స్థాయిలోనే పిల్లలతో పొదుపు చేయించాలనే ప్రభుత్వ లక్ష్యానికి బ్రేక్ పడింది. 8లో▸



కాలువ దుస్థితి మారేదెన్నడు?
గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ అధ్వానంగా మారింది. కాలువ నిండా పిచ్చిమొక్కలు పెరిగి చివరి ఆయకట్టుకు సాగునీరు వెళ్లలేని దుస్థితి నెలకొంది. 9లో▸



వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. తెల్లవారు జామున చిన్నపాటి వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ రేషన్ దుకాణంలో కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం సన్నం బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ బియ్యంలో అత్యధిక విలువగల పోషకాలు, విటమిన్లు ఉంటాయని, వీటి ద్వారా రక్తహీనత, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని పేర్కొన్నారు. రేషన్ బియ్యాన్ని విక్రయించవద్దని సూచించారు. తహసీల్దార్ రాజు, పౌరసరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్పీ ప్రజావాణి

భైంసాటౌన్: 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్'లో భాగంగా బుధవారం భైంసా పాత రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోగల క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల ప్రజావాణి నిర్వహించనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్పీ అందుబాటులో ఉండనున్నారు. డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు ఎస్పీని నేరుగా కలిసి సమస్యలు తెలిపి పరిష్కరించుకోవచ్చు.

పద్య వైభవానికి ఎంపిక

భైంసాటౌన్: హైదరాబాద్‌లోని సంస్కృతి కేంద్రంలో ఈ నెల 5న అవధాని భాను ప్రకాశాచార్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న పద్య వైభవం కార్యక్రమానికి జిల్లా కవులు ఎంపికైనట్లు కవి జాదవ్ పుండ్లిక్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 220 మంది పద్యకవులు తమ పద్యాలు పంపగా 180 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో జిల్లాకేంద్రానికి చెందిన బొందిడి పురుషోత్తంరావు, బీ వెంకట్, భైంసాకు చెందిన జాదవ్ పుండలిక్‌రావు పాటిల్, డీ వినాయక్‌రావు ఉన్నట్లు తెలిపారు. వీరిని జిల్లా కవులు కదారి దశరథ్, కొండూరు పోతన్న, నేరెళ్ల హనుమంతు, పీసర శ్రీనివాస్‌గౌడ్, బసవరాజు, పోలీస్ భీమేశ్, గంగుల చిన్నన్న, కవయిత్రులు నాగ రంజని, రావుల చంద్రకళ తదితరులు అభినందించారు.

హన్మాన్ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న దీక్షాపరులు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి గ్రామంలో మంగళవారం పలువురు భక్తులు హనుమాన్ దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహేశ్, రాకేశ్, సాయన్న, సంతోష్, వంశీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న దీక్షాపరులు

ముథోల్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన హన్మాన్ దీక్షాపరులు మంగళవారం పాదయాత్రగా జగిత్యాల జిల్లాలోని కొండగట్టుకు బయలుదేరారు. సుమారు 180 కిలో మీటర్ల దూరంలో ఉన్న స్వామివారిని దర్శించుకునేందుకు అంజన్న నామస్మరణ చేస్తూ పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర చేపట్టిన వారిలో రవి, యాదవ్, శ్రీధర్, ముకేశ్, ముత్యం, హరీశ్, మహేశ్ తదితరులున్నారు.

పింఛన్ల పంపిణీలో వసూళ్లను అరికట్టాలి

ఖానాపూర్: పట్టణంతోపాటు పలు గ్రామాల్లో సామాజిక పెన్షన్ లబ్ధిదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడాన్ని అరికట్టాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శులు పీటర్, సురేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. పెన్షన్ డబ్బుల కోసం వెళ్లే లబ్ధిదారుల వద్ద సంబంధిత అధికారులు, సిబ్బంది రూ.16 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నిస్తే ఉన్నతాధికారులకు ముడుపులు ఇవ్వాల్సి ఉంటుందని సిబ్బంది చెబుతున్నట్లు వివరించారు. ఈ విషయమై కలెక్టర్‌తోపాటు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

నిర్మల్ బల్దియాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది (ఫైల్)



- 31తో ముగిసిన రాయితీ గడువు
- ఆసక్తి చూపని దరఖాస్తుదారులు
- ఫీజు చెల్లించింది 6.401 మందే..
- సమకూరింది రూ.12.98 కోట్లు
- గడువు పెంపునకు ఎదురుచూపు

ఎల్‌ఆర్‌ఎస్ 16.41శాతమే..

నిర్మల్‌చైన్‌గేట్: ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఫీజులో 25 శాతం రాయితీ కల్పించినా దరఖాస్తుదారులు అంతగా ఆసక్తి చూపలేదు. ఫీజు చెల్లింపు గడువు మార్చి 31తో ముగియగా 16.41 శాతం మంది దరఖాస్తుదారులే ఫీజు చెల్లించారు. మెజార్టీ ఇంటి స్థలాల యజమానులు ఫీజు చెల్లిస్తారని భావించిన సర్కారు లక్ష్యం నెరవేరలేదు. చేతిలో డబ్బులు లేక కొందరు, ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందని మరికొందరు చెల్లింపులకు దూరంగా ఉంటూనే వచ్చారు.

నెల గడువు ఇచ్చినా..

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ కల్పించి సర్కారు నెల గడువు ఇచ్చింది. 2020 డిసెంబర్ 31 వరకు రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికే ఫీజు చెల్లింపు అవకాశం ఉంది. ఇందులో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో 26,487 మంది, 18 మండలాల పరిధిలో 17,716 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ నిబంధనల మేరకు 39,006 దరఖాస్తులు సరైనవిగా ఉన్నట్లు నిర్ధారించి ఫీజు చెల్లించుకునే అవకాశం కల్పించారు. భూయజమానులకు ఆయా మున్సిపాలిటీల్లోని ఉద్యోగులు ఫోన్ల ద్వారా, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. దీంతో మూడు మున్సిపాలిటీలతో గ్రామ పంచాయతీల పరిధిలో 6,401 ప్లాట్లకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. 16.41శాతం మంది మాత్రమే ప్రభుత్వం కల్పించిన 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకున్నారు.

చివరిరోజు మొరాయించిన సర్వర్

ఫీజు చెల్లింపునకు యూజర్ మాన్యువల్ ఫ్రీ రిజిస్ట్రేషన్ ఎల్‌ఆర్‌ఎస్–2020 పేరిట ప్రభుత్వం వెబ్‌సైట్ రూపొందించింది. అర్జీల పరిష్కారం కోసం మూడంచెల (లెవల్–1, లెవల్–2, లెవల్–3) విధానాన్ని అమలు చేసింది. దరఖాస్తుదారులు బల్దియాల్లో బారులు తీరినా.. సర్వర్ మొరాయించడంతో కొందరి క్రమబద్ధీకరణ ప్రక్రియ లెవల్–1 వద్దే నిలిచింది. కొందరు దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు యత్నించినా వెబ్‌సైట్‌లో వివరాలు కనిపించలేదు. ఇంకొందరికి క్షేత్రస్థాయి పరిశీలన పెండింగ్‌లో ఉన్నట్లు చూపించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు చూపిస్తే నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. వీటన్నింటికీ ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలే కారణమని అధికారులు చెప్పారు.

ఆసక్తిచూపని సామాన్యులు

ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని ఎక్కువగా 'రియల్' వ్యాపారులు, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల కొనుగోలుదారులు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. గతంలో అనధికారిక ప్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యులు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపునకు పెద్దగా ఆసక్తి చూపనట్లు సమాచారం. కొత్తగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తెలంగాణ ప్రభుత్వం మరోసారి అవకాశం ఇస్తుందని ఎదురుచూస్తున్నారు. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బఫర్ జోన్, చెరువులు, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలు, హోల్డ్‌లో పెట్టినవి, కోర్టుకేసులో ఉన్న ప్లాట్లతో పాటు కొన్ని సజావుగా ఉన్న వాటిని కూడా ఆన్‌లైన్‌లో చూపించకపోవడం, ఫీజు తీసుకోకపోవడం, ఇన్ని చేసినా.. ప్రొసీడింగ్ రాక ఇబ్బందిపడి చివరకు వెనుతిరిగి వెళ్లినవారూ ఉన్నారు. కాగా, గడువు ముగియడంతో మరోసారి అవకాశం ఇవ్వాలని, ఎల్‌ఆర్‌ఎస్ కొత్త దరఖాస్తులు తీసుకునే వెసులుబాటు కల్పించాలని ఇళ్ల స్థలాల యజమానులు కోరుతున్నారు. ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని, తమ చేతుల్లో ఏమీ లేదని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ వివరాలు ఇలా..

వచ్చిన దరఖాస్తులు	: 44,203
అర్హత పొందినవి	: 39,006
ఫీజు చెల్లించిన వారు	: 6,401
ప్రొసీడింగ్ పొందినవారు	: 1,418
వచ్చిన ఆదాయం	: రూ.12.28కోట్లు

మరో అవకాశమివ్వాలి



నాకు పట్టణంలో ఒక ప్లాట్ ఉంది. దీనికోసం 2020లో రూ.వెయ్యి కట్టి ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్న. ఫీజు చెల్లిద్దామంటే నా దగ్గర సమయానికి డబ్బులు లేవు. దీంతో ప్రభుత్వం కల్పించిన 25 శాతం ఫీజు రాయితీ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయిన. – లింగమ్మ, నిర్మల్

ప్రొసీడింగ్ అందలేదు



నేను గతంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్నాను. ఇటీవల క్రమబద్ధీకరించుకోమని అధికారులు తెలుపగా నా మొబైల్ ద్వారా ఫీజు చెల్లించాను. ఇప్పటివరకు ప్రొసీడింగ్ కాపీ అందలేదు. ఇది ఎక్కడ తీసుకోవాలో తెలియడం లేదు. – జోగు శేఖర్, నిర్మల్

సమకూరింది రూ.6.3 కోట్లే..



రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం కల్పించిన 25శాతం రాయితీ ద్వారా నిర్మల్ మున్సిపాలిటీకి రూ.6.3 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం గడువు పొడగింపు గురించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశానుసారం నడుచుకుంటాం. – జగదీశ్వర్‌గౌడ్, నిర్మల్ మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీల వారీగా ఇలా..

బల్దియా	దరఖాస్తులు	చెల్లించినవారు	ఆదాయం
ఖానాపూర్	1,928	106	రూ.27లక్షలు
నిర్మల్	15,515	1,975	రూ.6.30కోట్లు
భైంసా	9,044	582	రూ.83లక్షలు
18 మండలాల్లో	17,716	2,700	రూ.5.85కోట్లు



అమాత్యయోగం ఎవరికో..?

- కేబినెట్ బెర్త్‌పై వీడని ఉత్కంఠ
- ముహూర్తం ఖరారు.. నేతల్లో టెన్షన్
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చర్చ



వివేక్ వెంకటస్వామి



ప్రేమ్‌సాగర్‌రావు



గడ్డం వినోద్



వెడ్మ బొజ్జు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఈ నెల 3వ తేదీన ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఎవరికి మంత్రి పదవి దక్కుతుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. కేబినెట్ బెర్త్ ఎవరిని వరిస్తుందనే చర్చ సామాన్యుల నుంచి రాజకీయవర్గాల వరకు జరుగుతోంది. హైకమాండ్ నిర్ణయంపై ఆసక్తి పెరిగిన వేళ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ ఎమ్మెల్యేకు అవకాశం వస్తుందా.. లేదా.. అనే టెన్షన్‌లో కొట్టుమిట్టాడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఖానాపూర్ నుంచి మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. వీరిలో మంచిర్యాల జిల్లాకు చెందినవారే ముగ్గురు. ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కూడా పరిగణనలోకి తీసుకోవాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పోటీలో ఎవరెవరు?

బెల్లంపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం వినోద్ తానే సీనియర్‌నని చెప్పుకొంటూ ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారు. సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తనకు అవకాశం కల్పించాలని కోరారు. మరోవైపు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పార్టీ కోసం కష్టపడిన తనకే పదవి రావాలని వాదిస్తున్నారు. ఒక దశలో ఆయనకు కేబినెట్ బెర్త్ ఖాయమని సంకేతాలు వచ్చాయి. తాజా పరిణామాలతో సందిగ్ధత నెలకొంది. ఆయన అనుచరులు మంత్రి పదవి కోసం డిమాండ్ చేస్తున్నారు. ఇక చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయన వర్గం ఉత్సాహంలో ఉంది. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి.. వివేక్‌ను మంత్రి వివేక్‌గారూ అని సంబోధించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. మాల సామాజిక వర్గం నుంచి ఆయనకు బెర్త్ దక్కినట్లు చర్చలు ఊపందుకున్నాయి. అయితే హైకమాండ్ నుంచి ఎవరికీ స్పష్టత రాలేదు. దీంతో తుది జాబితాలో ఎవరుంటారనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది.

హైకమాండ్ జాగ్రత్తలు

కాంగ్రెస్ అధిష్టానం మంత్రి పదవుల ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. పార్టీలో వ్యతిరేకత రాకుండా అభిప్రాయాలు సేకరిస్తూ, ఇంటెలిజెన్స్ నివేదిక ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటోంది. మొదటి విస్తరణలోనే జిల్లాకు అవకాశం దక్కుతుందని అంతా భావించారు. తర్వాత ఈ ప్రక్రియ ఏడాదిన్నరగా వాయిదా పడుతూ వచ్చింది. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఇప్పుడు ముహూర్తం ఖరారవడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేగింది. ఈ విస్తరణ ఉమ్మడి జిల్లా ప్రాతినిధ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది, ఎవరికి అవకాశం దక్కుతుందనే కొన్ని గంటల్లో తెరపడుతుందనే చర్చ జరుగుతోంది.

'తెలంగాణలో బుల్డోజర్ల ప్రభుత్వం'



పోలీసుల అదుపులో దిగంబర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణలో బుల్డోజర్ల ప్రభుత్వం నడుస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తున్న నేపథ్యంలో మంగళవారం దిగంబర్‌ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా దిగంబర్ మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేట్ వ్యక్తులకు యూనివర్సిటీ భూములను కట్టబెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. విద్యార్థులు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దొరల రాజ్యం నడుస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికి వెళ్లనని ప్రకటిస్తూ.. యూనివర్సిటీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేస్తామని దిగంబర్ హెచ్చరించారు.

ఘనంగా వీరహనుమాన్ విజయయాత్ర



విజయయాత్రలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, నాయకులు, భక్తులు

ఖానాపూర్: బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలో మంగళవారం వీర హనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హాజరై ఎన్టీఆర్ చౌరస్తాలో మాట్లాడారు. భారతీయులంతా దేశం కోసం.. ధర్మం కోసం పని చేయాలని సూచించారు. హిందువులకు సంతాన నియంత్రణతో ముప్పు ఉందని, ఆదాయంతో పాటు సంతానం పెంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ బోర్డు బిల్లుకు త్వరలో ఆమోదం లభించనుందని, దీనిని అడ్డుకునేందుకు చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పి కొడుతూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. యువత భక్తి మార్గంతో ధర్మాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలతో పాటు రాముడు, ఆంజనేయ విగ్రహాల దాత ఒమన్ తెలంగాణ సమితి అధ్యక్షుడు గుండేటి గణేశ్‌ను బజరంగ్‌దళ్ నాయకులు శాలువాలతో సన్మానించారు. స్థానిక జగన్నాథ్‌రావుచౌరస్తా వద్ద ఆదిలాబాద్ గోపాల మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి ర్యాలీని ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. గుండేటి గణేశ్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు బజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల వెంట వీరహనుమాన్ శోభాయాత్రతో ఖానాపూర్ కాషాయమయమైంది. అనంతరం శ్రీరాంనగర్‌లోని హన్మాన్ మందిర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్‌రాథోడ్, ఆర్‌ఎస్‌ఎస్ వక్త నాగమణి లింగన్న, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు సురేశ్, నాయకులు అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, దయానంద్, రమేశ్, రాజశేఖర్, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్బంధం ఆపాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాఉద్యమాలు, విద్యార్థుల పోరాటాలపై పోలీసు నిర్బంధాన్ని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణకు చేపట్టిన విద్యార్థుల పోరాటం అణచివేత, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులపై జరుగుతున్న అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాఉద్యమాలను అణచివేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ భూముల అమ్మకం ద్వారా అధికారం నిలుపుకొనే యత్నాన్ని ప్రజలు సహించరని హెచ్చరించారు. 400 ఎకరాల హెచ్‌సీయూ భూమిని విక్రయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన విద్యార్థులు, సీపీఎం నాయకత్వాన్ని విడుదల చేయాలని, విద్యార్థులపై పెట్టిన కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. నాయకులు ఫసీ ఉద్దీన్, పోశెట్టి, డాకూరు తిరుపతి తదితరులున్నారు.

పింఛన్.. ఇప్పించరూ!



ఈ చిత్రంలోని దివ్యాంగురాలి పేరు భూసారి దివ్య. పట్టణంలోని గుజిరిగల్లికి చెందిన ఈమె డిగ్రీ పూర్తి చేసి కొద్దిరోజులు ప్రైవేట్ ఉద్యోగం చేసింది. కచేరీల్లోనూ పాటలు బాగా పాడేది. ఈ క్రమంలో ఒకసారి తీవ్ర జ్వరం రాగా, అస్వస్థతకు గురై బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడింది. అప్పటి నుంచి కాలు, నోరు, చేయి పడిపోయి ఇంటికే పరిమితమైంది. 22ఏళ్ల దివ్యను చూస్తే ఎవరికైనా జాలి కలగకమానదు. తండ్రి మృతిచెందగా, తల్లి ప్రతిభపై కుటుంబభారం పడింది. దివ్య ప్రస్తుతం ఇంట్లో మంచానికి పరిమితమై సదరం సర్టిఫికెట్ కోసం ఎదురుచూస్తోంది. ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసి శిబిరానికి వెళ్లినా.. ధ్రువపత్రం రాలేదని వాపోయింది. తన కూతురికి సదరం సర్టిఫికెట్ ఇప్పించి, పింఛన్ మంజూరు చేయాలని ప్రతిభ కోరుతోంది.

ఇలా.. వీరేకాకుండా జిల్లాలో ఎంతోమంది దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు పింఛన్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

- 'ఆసరా' కరువైన దివ్యాంగులు
- 'చేయూత' కోసం ఎదురుచూపు

భైంసాటౌన్: ప్రభుత్వాలు ఏళ్ల తరబడి కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఏ పనీ చేయలేక కుటుంబానికి భారంగా మారి అసహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వం ఆసరా పథకం కింద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు, ఇతరులకు నెలకు రూ.2,016 చొప్పున పింఛన్ అందించేది. దివ్యాంగులకు రూ.2,516 అందించగా, ప్రస్తుతం దాన్ని రూ.4,016కు పెంచారు. ప్రస్తుతం ప్రభుత్వం చేయూత పేరిట పింఛన్లు అందిస్తోంది. అయితే, కొత్తగా ఎలాంటి పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారోనని ఎంతోమంది అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు, వితంతులు ఎదురుచూస్తున్నారు.

కార్యాలయాల్లోనే దరఖాస్తులు

కొన్నేళ్లుగా ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదు. ప్రస్తుతం ఇంట్లో పింఛన్ పొందుతున్న భార్య లేదా భర్త చనిపోతే వారి పింఛన్‌ను మాత్రమే రెండో వ్యక్తికి ఇస్తున్నారు. కొత్తగా ఎలాంటి పింఛన్లు అందడం లేదు. భర్త చనిపోయి ఎంతోమంది వితంతువులు పింఛన్ రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఎంతోమంది దివ్యాంగులు కూడా పింఛన్లు లేక, ఎలాంటి ఆసరా లేక అవస్థలు పడుతున్నారు. పింఛన్ల కోసం పట్టణాల్లో ప్రజలు మున్సిపల్ కార్యాలయాలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేస్తున్నారు. పింఛన్ మంజూరు చేయాలంటూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అధికారులు కూడా చేసేది లేక దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇలా మున్సిపల్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ, ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేయడంలేదు. దీంతో పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయోనని అర్హులంతా ఆశగా ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు.



ఈ చిత్రంలోని బాలుడి పేరు రావుల శ్రేజన్. భట్టిగల్లికి చెందిన సుజాత, రవి దంపతుల కుమారుడైన ఇతడు పుట్టుకతోనే బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. సదరం సర్టిఫికెట్ పొందినా.. ఇప్పటికీ పింఛన్ మంజూరు కాలేదు. తండ్రి వ్యవసాయం చేస్తూ, తల్లి బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దివ్యాంగుడైన తమ కొడుకుకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఈ చిత్రంలోని దివ్యాంగురాలి పేరు తిమ్మపురే సునీత. భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన ఈమెకు పుట్టుకతోనే బుద్ధిమాంద్యం ఉంది. తండ్రి పాండురంగ్ అనారోగ్యంతో బాధపడుతుండగా, తల్లి విమల 37 ఏళ్ల కూతురి బాగోగులు చూస్తుంటుంది. 90శాతం వైకల్యంతో ఉన్న సునీతకు పర్మనెంట్ వ్యాలిడిటీతో సదరం సర్టిఫికెట్ జారీ అయింది. గత ప్రభుత్వ హయాంలో ఆసరా పథకం కింద పింఛన్ మంజూరైంది. 2018 జనవరి నుంచి 2019 జనవరి వరకు నెలకు రూ.1,500 చొప్పున బ్యాంక్ ఖాతాలో పింఛన్ మొత్తం జమయ్యేది. కానీ, తరువాత పింఛన్ నిలిచిపోయింది. దీంతో ఆమె అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఆర్థికంగా ఎలాంటి ఆధారం లేదని, దివ్యాంగురాలైన తన కూతురికి పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని ఆమె తల్లి విమల కోరుతోంది.

క్లుప్తంగా

జనావాసాల్లోకి చుక్కల దుప్పి



కాలనీలో తిరుగుతున్న దుప్పి

ఖానాపూర్: అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతో జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిని అటవీ అధికారులు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం కుక్కలు వెంబడించడంతో దుప్పి ఓ నివాసంలో చొరబడి అందులోనే ఉండిపోయింది. దీంతో మంగళవారం విద్యానగర్‌లోని ఓ నివాసంలో దుప్పిని గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎఫ్ఎస్‌వో రవీందర్, ఎఫ్‌బీవో సాధు ముత్యం అక్కడికి చేరుకుని పట్టుకునే ప్రయత్నం చేశారు. తప్పించుకున్న దుప్పి పలువురి నివాసాల్లోకి చొరబడింది. ఎట్టకేలకూ అరగంట సేపటికి ఓ ఇంట్లో బంధించారు. కళ్లకు గంతలు, కాళ్లకు తాళ్లతో కట్టి బంధించారు. అనంతరం అటవీ శాఖ జీపులో అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

మహిళ మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌కు చెందిన దుర్గం వజ్రమ్మ (46)మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు. వజ్రమ్మ 20 ఏళ్ల క్రితం భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటోంది. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. గత నెల 29న డ్యూటీకి వెళ్లి వచ్చింది. మంగళవారం ఉదయం ఇంట్లోనుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి కిటికీలోంచి చూడగా మృతిచెంది ఉంది. వెంటనే మృతురాలి తల్లి దుర్గం మల్లమ్మకు సమాచారం అందించారు. గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చని మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

అగ్నికి ఆహుతైన జొన్నపంట

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): రైతు సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అగ్నికి ఆహుతైన ఘటన జైనథ్ మండలంలోని దీపాయిగూడలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎలాల్ గిరీష్ రెడ్డి నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని జొన్న పంట సాగు చేశాడు. వేసవి కాలం కావడంతో పక్క పొలంగట్టు నుంచి మంటలు చెలరేగి జొన్నచేనుకు అంటుకున్నాయి. అప్రమత్తమైన రైతు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలు అదుపులోకి తెచ్చారు. ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చేదని లక్షకు పైగా నష్టం జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నాడు.

ఉపాధ్యాయుడు రిమాండ్

నిర్మల్: పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఆంగ్ల ఉపాధ్యాయుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. ఆయన కథనం ప్రకారం... నర్సాపూర్ (జి)మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఫిబ్రవరి నెలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయినేని మోహన్‌రావు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించారు. అతనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదుకాగా అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు.మంగళవారం నిర్మ ల్‌జిల్లా కేంద్రంలో మోహన్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు.

బడి బ్యాంక్ జాడేది?

- అమలుకాని సంచయిక పథకం
- గతంలో పాఠశాలల్లో నిర్వహణ
- అమలు చేస్తే మేలంటున్న పోషకులు

లక్ష్మణచాంద(నిర్మల్): పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పొదుపు అలవాటు చేసేందుకు గతంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంచయిక పథకం ఉమ్మడి జిల్లాలోని ఏ పాఠశాలలోనూ అమలు కావడంలేదు. తల్లిదండ్రులు ఇంటి వద్ద తమపిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో ఇచ్చిన డబ్బులను ఎలా పొదుపు చేయాలి.. ఎంత వరకు ఖర్చు చేయాలి.. ఏ పనికి ఎంత ఖర్చు చేయాలి.. వంటి అంశంపై సంచయిక పథకం ద్వారా విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. పాఠశాలలో అమలు చేసే ఈ కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. విద్యార్థులకు పొదుపుపై అవగాహన కల్పించడంతో పాటు వారితో పొదుపు చేయించేలా ప్రోత్సహించే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రస్తుతం ఏ పాఠశాలలో ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పథకం మూలనపడింది.

విద్యార్థుల్లో పొదుపు అలవర్చడమే లక్ష్యం...

తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న చిన్న ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులను చిరుతిండ్ల కోసం ఖర్చు చేస్తారు. దీంతో విద్యార్థులకు చిన్ననాటి నుండే అనవసర ఖర్చులు చేయడం అలవాటవుతుంది. ఇలాంటి దుబారా ఖర్చులు చేయకుండా సంచయిక పథకంలో భాగంగా ఆయా పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోషకులు ఇచ్చిన డబ్బులను కిడ్డీ బ్యాంకులో జమ చేసేలా చేస్తారు. ఇందులో ఒక రూపాయి నుంచి మొదలు ఎంత వరకైనా జమ చేసుకునే వెసులుబాటు ఉంది. విద్యార్థి ఇంటి నుండి తెచ్చిన డబ్బులను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని కిడ్డీ బ్యాంకులో వేస్తారు. అవసరం ఉన్నప్పుడు మళ్లీ రిజిస్టర్‌లో నమోదు చేసుకుని విద్యార్థి జమ చేసుకున్న డబ్బులు ఇస్తారు. ఇలా విద్యార్థులు సంవత్సరం పొడగునా జమ చేసిన పొదుపు డబ్బులను చివరన తీసుకునే అవకాశం ఉంది. అలాగే వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మంది విద్యార్థులు కూడా ఇందులో డబ్బులను పోగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా ఒక విద్యార్థిని చూసి మరొక విద్యార్థి డబ్బులను పొదుపు చేసే అలవాటు నేర్పించడమే ఈ పథకం లక్ష్యం. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఏ ఒక్క పాఠశాలలో కూడా పథకం అమలు కావడం లేదు. దీంతో విద్యార్థులకు చిన్నతనం నుండి తమ తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను దుబారా ఖర్చులు చేస్తూ పొదుపు చేసే అలవాటుకు దూరం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సంచయిక పథకం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వద్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఉమ్మడి జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	విద్యార్థులు	ప్రాథమికోన్నత	విద్యార్థులు	ఉన్నత	విద్యార్థులు	మొత్తం
నిర్మల్	577	23,398	89	6,373	164	37,019	67,790
మంచిర్యాల	511	13,678	97	4,234	108	23,442	41,354
కుమురంభీం	561	22,420	100	12,380	60	3,148	37,948
ఆదిలాబాద్	500	-	119	-	120	-	65,000

అనవసర ఖర్చులు చేస్తున్నాం



పాఠశాలలో సంచయిక పథకం అమలులో లేకపోవడంతో మా తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను అనవసర పనులకు ఖర్చు చేస్తున్నాం. దీంతో పొదుపు చేసుకునే అలవాటు లేకుండా పోతోంది.

– సోను, విద్యార్థి, వద్యాల్ ఉన్నత పాఠశాల

పథకం అమలు చేయాలి



గతంలో పాఠశాలలో సంచయిక పథకం ఉండేదని, విద్యార్థులకు తమ తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులను వృథా ఖర్చులు చేయకుండా పొదుపు చేసుకునే వారని మా ఉపాధ్యాయులు చెప్పారు. కానీ ఇప్పుడలా చేయడం లేదు. ప్రభుత్వం స్పందించి ఈ పథకం అమలయ్యేలా చర్యలు చేపట్టాలి.

– వైష్ణవి, విద్యార్థిని, పీచర ఉన్నత పాఠశాల

అమలైతే విద్యార్థులకు మేలు



గతంలో నేను పనిచేసిన పాఠశాలలో కిడ్డీ బ్యాంకులు ఏర్పాటు చేసి విద్యార్థులకు పొదుపు అలవాటు చేశా. కానీ ఇప్పుడు ఈ పథకం అమలులో లేకపోవడంతో మూలనపడింది. పథకం అమలైతే విద్యార్థులకు చిన్ననాటి నుండే దుబారా ఖర్చులు చేయడం మాని పొదుపు చేయడం అలవాటవుతుంది.

– రాజు నాయక్, ప్రధానోపాధ్యాయుడు, లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల

గ్రూప్-1 లో మెరిసిన పొనకల్ వాసి



అనిల్‌కుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లి భాగ్య

జన్నారం: ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు పట్టుదలతో చదివి గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో 161వ ర్యాంకు, మల్టీజోన్ 1లో 82వ ర్యాంకు సాధించాడు జన్నారం మండలం పొనకల్‌కు చెందిన నగూరి అనిల్‌కుమార్. నగూరి హరిదాసు, భాగ్య దంపతుల మూడో కుమారుడు అనిల్‌కుమార్ పదోతరగతి వరకు జన్నారం, ఇంటర్ కరీంనగర్ ప్రైవేట్ కళాశాలలో, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. పదేళ్ల క్రితమే హరిదాసు అనారోగ్యంతో మృతి చెందాడు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు గ్రూప్స్‌కు ప్రిపేరయ్యాడు. ఇటీవల విడుదలైన గ్రూప్-3లో రాష్ట్రస్థాయిలో 862వ ర్యాంకు, గ్రూప్-2 లో 382వ ర్యాంకు సాధించాడు. నాలుగు నెలల క్రితం విడుదలైన గ్రూప్-4లో ఎంపికై ఉస్మానియా యూనివర్శిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నాడు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు అనిల్‌కుమార్‌ను అభినందించారు.

చెక్‌బౌన్స్ కేసులో రెండేళ్ల జైలు

చెన్నూర్: మండలంలోని కిష్టంపేటకు చెందిన బొమ్మ శ్రీనివాస్ వేసిన చెక్‌బౌన్స్ కేసులో చెన్నూర్ మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఆలం సత్తయ్యకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పర్వతపు రవి తీర్పునిచ్చారు. అకౌంట్‌లో డబ్బులు లేకుండా చెక్కులు ఇస్తే చట్టపరమైన శిక్ష తప్పదని జడ్జి పేర్కొన్నారు.

‘నాలెడ్జ్ ఆన్‌వర్డ్స్’తో చదువుపై ఆసక్తి

బెల్లంపల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆడుతూ పాడుతూ చదువుపై ఆసక్తి పెంచుకునేందుకు బెల్లంపల్లికి చెందిన ఏకదంత మిత్రమండలి సభ్యులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సెలవుల్లో పిల్లలు సెల్‌ఫోన్, టీవీలకు అతుక్కుపోకుండా తమకు తెలియకుండానే విద్యాభివృద్ధి, విజ్ఞాన అంశాలు తెలుసుకునేలా, చదువుపై దృష్టిసారించేలా కార్యక్రమానికి రూపకల్పన చేశారు. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభా పాటవాలు వెలికి తీయాలనే ఉద్దేశంతో ‘నాలెడ్జ్ ఆన్‌వర్డ్స్’ ప్రారంభించారు. విద్యార్థుల ను ఆకర్షించేలా బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 28వ వార్డులో గోడలపై విజ్ఞానం, విద్య, శాస్త్రీయ అంశాలు, గణిత సూత్రాలు, దేశ, రాష్ట్ర చిత్రపటాలను రంగురంగులతో చిత్రీకరిస్తున్నారు. ఇందుకు అయ్యేఖర్చును ఏకదంత మిత్ర మండలి సభ్యులు తలా కొంత భరించుకుంటున్నారు. పదిమందికి పైగా ఉన్న సభ్యుల్లో ప్రైవేట్ టీచర్లు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు కావడం గమనార్హం. ప్రస్తుతం గోడలపై చిత్రీకరించిన అంశాలను తెలుసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించగానే ఏప్రిల్ చివరి వారం నుంచి ఈ కార్యక్రమాన్నీ లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నిర్వాహకుడు బొంతల శ్రీనివాస్ తెలిపారు.



గోడలపై చిత్రాలను వివరిస్తున్న సభ్యురాలు

మూతబడిన బార్ల పునరుద్ధరణ

- ఎక్సైజ్ శాఖ నుంచి టెండర్ నోటిఫికేషన్
- ఉమ్మడి జిల్లాలో ఐదింటి కోసం..
- దరఖాస్తులు అధికంగా వస్తే లక్కీడ్రా యోచన

సాక్షి,ఆదిలాబాద్: రెన్యూవల్ చేసుకోకపోవడంతో మూతబడిన మద్యం బార్లను పునరుద్ధరించాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ నుంచి రాష్ట్రంలో ఇలా మూతబడిన బార్లను ఇదివరకే గుర్తించారు. తాజాగా వాటి పునరుద్ధరణ కోసం రాష్ట్రంలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇదిలా ఉంటే జిల్లాల వారీగా దీనికి సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలా రెన్యూవల్ చేసుకోని బార్లు ఐదు ఉన్నట్లు గుర్తించారు. ఆదిలాబాద్ పట్టణంలో మూడు, బెల్లంపల్లి, నస్పూర్‌లలో ఒక్కొక్కటి చొప్పున మూతబడిన బార్లను పునరుద్ధరించే దిశగా ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. ఈనెలలోనే దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ ఐదు బార్లకు రూ.42 లక్షల చొప్పున స్లాబ్ నిర్ణయించారు. ఇటీవల కాలంలో బార్లలో విక్రయాలు మందగించాయని పలువురు బార్ యజమానులు రెన్యూవల్‌కు ముందుకు రాలేదు. దీంతో గతేడాది నుంచి ఈ బార్లు మూతబడ్డాయి. తిరిగి తెరిపించాలని చూస్తున్న ఎక్సైజ్ శాఖ ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాల్సిందే.



లక్కీడ్రా యోచన..

సాధారణంగా వైన్స్‌లకు టెండర్లు నిర్వహించినప్పుడు ప్రభుత్వం దరఖాస్తుదారుల నుంచి లక్కీడ్రా విధానంలో కేటాయింపు జరుపుతుంది. బార్ల కేటాయింపులో ఈ విధానం కనిపించదు. మధ్యలో లిక్కర్ బార్ బిజినెస్ మందగించినప్పటికీ తాజాగా పలువురు యువకులు వీటిని దక్కించుకునేందుకు ఆసక్తి కనబర్చుతున్నారని ఎక్సైజ్ శాఖ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో అధికంగా దరఖాస్తులు వస్తాయని చెబుతున్నారు. మూడు కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే దానికి సంబంధించి లక్కీడ్రా ద్వారా కేటాయింపు జరపనున్నట్లు శాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి విధివిధానాలను త్వరలో రూపొందించి ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. వివరాలు అడిగేందుకు ఆదిలాబాద్ డీపీఈవో హిమశ్రీని మొబైల్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



లచ్చన్న మృతదేహం

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన చాకపురం లచ్చన్న (72), చందాల రమేశ్, లక్ష్మణ్ మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుక్కలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. లచ్చన్న, రమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సాగర్, పైలట్ మహేష్ క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లచ్చన్న మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పదంగా హోటల్ యజమాని...

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాళ్లపేటకు చెందిన హోటల్ యజమాని అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై వినీత తెలిపారు. రాళ్లపేటకు చెందిన నల్లపు ప్రభుదాసు హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 31న అతిగా మద్యం సేవించి హోటల్‌కు రావడంతో అతని భార్య షుక్రుత మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదేరోజు రాత్రి హోటల్ నుంచి వర్కర్‌ను, భార్యను ఇంటికి వెళ్లగొట్టాడు. తెల్లవారి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు హోటల్‌కు వచ్చి చూడగా పక్క గల్లీలో ఉన్న ఓ ఇంటి ముందు స్పృహ కోల్పోయి ఉన్నాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుండెజబ్బుతో గానీ మరే ఇతర కారణాలతో గాని మృతిచెంది ఉండవచ్చని మృతుని భార్య షుకృత ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

లక్సెట్టిపేట: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన గడికొప్పుల రామయ్య (65)తో అదే గ్రామానికి చెందిన వరుసకు అల్లుడైన సత్తయ్య కొంతకాలంగా గొడవపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. గ్రామంలో కనిపించిన చోట బూతులు తిడుతూ వేధింపులకు గురిచేశాడు. దీంతో మనస్తాపానికి గురైన రామయ్య మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



రామయ్య (ఫైల్)

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్
- ఆదివాసీలతో ఆత్మీయ సమ్మేళనం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో ఆదివాసీలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివాసీలకు చెందిన తొమ్మిది తెగల నాయకులు, పెద్దలు, రాయిసెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారులందరూ ఆదిలాబాద్ జిల్లా ప్రాముఖ్యతను, విశిష్టతను తెలియచేశారన్నారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉన్నాయన్నారు. ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే నేరం కావడంతో లైసెన్స్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీని పలువురు నాయకులు శాలువాతో సత్కరించారు. అనంతరం ఆదివాసీ నాయకులతో కలిసి సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు గోడం నగేశ్, జిల్లా మేడి మెస్రం దుర్గు పటేల్, మెస్రం మనోహర్, కెస్లాపూర్ ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, ఆదివాసీ సార్‌మేడీలు, పటేల్‌లు, 9 తెగల నాయకులు, పెద్దలు, ఉట్నూర్ సీఐ మొగిలి, జైనథ్ సీఐ సాయినాథ్, రూరల్ సీఐ ఫణిందర్, ఎస్సైలు మనోహర్, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్



చంద్రమోహన్

మంచిర్యాలటౌన్: తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల హోటల్ క్లేరియన్‌లో నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా హైకోర్టు జడ్జి పి.నవీన్‌రావు వ్యవహరించారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది ఓటర్లు పాల్గొనగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఉదారి చంద్రమోహన్‌గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అసోసియేట్ సెక్రెటరీగా సుకుమార్ ఫ్రాన్సిస్ గెలుపొందారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు పదోన్నతి

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సోలోమన్‌కు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా పదోన్నతి కల్పిస్తూ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆదిలాబాద్ ఆర్ఎంగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ పదోన్నతి రావడంపై ఆర్ఎం కార్యాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని అంబేద్కర్‌చౌక్ సమీపంలో గల రేణుక హోటల్‌లో పనిచేసే గెడం వినోద్ సెల్‌ఫోన్‌ను మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన జాదవ్ ప్రవీణ్ దొంగిలించాడు. మంగళవారం వినాయక్ చౌక్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి జాదవ్ ప్రవీణ్ పారిపోతుండడంతో అనుమానం వచ్చి పట్టుకుని విచారించగా సెల్‌ఫోన్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు.

సూపర్ స్పెషాలిటీలో గ్యాస్ట్రో సేవలు

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గ్యాస్ట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో గ్యాస్ట్రో సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు పలు రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, కొత్తగా గ్యాస్ట్రో ఎంట్రనాలజీ సేవలు ప్రారంభించామన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరోసర్జరీ, యూరాలజీ, క్యాన్సర్ తదితర వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లా ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని, ఇక్కడే అన్నిరకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రతీ మంగళ, గురువారాల్లో గ్యాస్ట్రో సంబంధిత వైద్యులు డాక్టర్ వివేక్ రాథోడ్ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, డాక్టర్ సత్యనారాయణ, ఆర్ఎంవో డాక్టర్ చంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ట్రో సేవలు ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

గురువుకు ఘనంగా సెండాఫ్



ముస్కు సంజీవరెడ్డి దంపతులను ఎడ్లబండిపై ఊరేగిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని దేహగామలో పదవీ విరమణ పొందిన గురువుకు గ్రామస్తులు సెండాఫ్ ఘనంగా ఇచ్చారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన ముస్కు సంజీవరెడ్డి దంపతులను మంగళవారం గ్రామస్తులు ఎడ్లబండిపై ఊరేగించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ముస్కు సంజీవరెడ్డి 27 ఏళ్లుగా పేద విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ఆయన సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌రావు, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, లింగారెడ్డి, రామారావు, మోనిష్‌రెడ్డి, రాంరెడ్డి, దేవన్న, త్రియంబక్, తదితరులు పాల్గొన్నారు.

వేలాడే తీగలు.. కర్రలే స్తంభాలు



చించోలి(బి) సమీపంలో విద్యుత్ తీగలు చూపుతున్న రైతు



దేవితండా సమీపంలో రైతు ఏర్పాటు చేసుకున్న కర్ర స్తంభం

విద్యుత్ వ్యవస్థను గాడిన పెడుతున్నామని అధికారులు చెబుతున్నారు. చేలల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్ కూడా నిర్వహించారు. కానీ, క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదు. సారంగాపూర్ మండలంలోని చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. మరో పక్షం రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. హార్వెస్టర్లకు విద్యుత్ తీగలు ఇబ్బందిగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఇలా కర్రలతో స్తంభాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మండలంలోని చించోలి(బి), దేవితండా, రవీంద్రనగర్ తండాలకు వెళ్లే దారిలో ఇలాంటి దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం రైతుల పొలాల్లో మిడిల్ పోల్స్ వేశామని, వేస్తున్నామని చెబుతున్నారు.

– సారంగాపూర్